నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఝూంసిగ్ ఆలయం, మార్కెట్ యార్డ్, ఏలియాస్ రోడ్ ఫీడర్ల పరిధిలోని బాలాజీనగర్, సత్యనారాయణనగర్, మందులగుడ, వీబీజీ గార్డెన్, ఫ్లవర్ మార్కెట్, గుడిమల్కాపూర్, పద్మనాభనగర్, లక్ష్మీనగర్, కరోల్ బాగ్, సాయిబాబా ఆలయం, పీఅండ్‌టీ కాలనీ, రేతిబౌలీ పెట్రోల్ పంప్, లెదర్ ఫ్యాక్టరీ, ఉడిపి హోటల్, ఎసీ గార్డ్స్, ఎస్‌బీఐ బ్యాంక్, ఐడీబీఐ క్వార్టర్స్, ఏషియన్ అపార్ట్‌మెంట్స్, బజార్‌ఘాట్, ఏ–బ్యాటరీ లైన్, బిలాల్ మసీద్, ఏపెక్స్ ప్రింటింగ్ ప్రెస్, పోలీస్ క్వార్టర్స్, శాంతినగర్, లక్డీకాపూల్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, గంగా జమున హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ నేతాజీనగర్, ఆలపాటి నగర్ ఫీడర్ల పరిధిలోని నేతాజీ నగర్, శ్రీనివాస్‌నగర్, జ్యోతినగర్, సర్దార్‌బాగ్, మొఘల్కా నాలా, దిల్‌షాద్ నగర్, అయోధ్య నగర్, మిలాన్ గార్డెన్, రూఫ్ గార్డెన్, అంకుర ఆస్పత్రి, పారడైజ్ హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్/బహదూర్‌పురా: ఓల్డ్ సిటీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం, రెండేళ్ల కాల పరిమితి గల ఈ ఐటీఐ, ఏటీసీలోని కొత్త అడ్వాన్స్‌డ్‌కోర్సులు ఉన్నాయన్నారు. మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్, ఆసస్ మూజింగ్ అడ్వాన్స్ టూల్స్, అడ్వాన్స్ సిమన్సీ మెసినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో ఖాళీలున్నాయన్నారు. ఈ కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా డిప్లొమా, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 040–24461815లో సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



మాన్య జాయిస్‌ను అభినందిస్తున్న కోచ్ అలికా

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అంతర్జాతీయ రిథమిక్ జిమ్నాస్టిక్స్ న్యాయ నిర్ణేత, కోచ్ అలికాజో అన్నారు. సీబీఎస్ఈ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ రీజినల్ మెడల్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14 బాలికల విభాగంలో గెలుపొందిన మాన్య జాయిస్‌ను ఆమె అభినందించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

భగిదారి న్యాయ్ సమ్మేళనం



మేయర్‌తో కలిసి సమ్మేళనంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా

అబిడ్స్: ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగిదారి న్యాయ్ సమ్మేళనంలో గోషామహల్ సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ న్యాయ్ సమ్మేళనంలో శుక్రవారం ఆమె పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మమతా గుప్తా మాట్లాడుతూ..ఇలాంటి సమ్మేళనంతో కార్యకర్తలకు న్యాయ విభాగాల్లో మంచి అవగాహన కలుగుతుందన్నారు.

రేపు బోనాల జాతర ముగింపు సమావేశం


గోపిశెట్టి రాఘవేందర్

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం ప్రార్థన మందిరంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈసారి బోనాల ఉత్సవాలు ఆనందోత్సాహాల నడుమ ముగియడానికి సహకరించిన సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులతో పాటు కమిటీ ప్రతినిధులు, ఆయా ఆలయాల నిర్వాహకులతో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సహకరించిన అధికారులతో పాటు ప్రతినిధులను సన్మానించి ధన్యవాదాలు తెలియజేయనున్నామన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

- 27 మున్సిపల్ డివిజన్లలో 147 బృందాల ఏర్పాటు
- రోజుకో డివిజన్ చొప్పునా ఫాగింగ్
- గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది


దోమల నివారణకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


మూసీలో గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం


సంపులో మందు వేస్తున్న సిబ్బంది

అబిడ్స్: వర్షాలు భారీగా కురుస్తుండడంతో దోమల సీజన్ ప్రారంభమైంది. అన్ని ప్రాంతాలు, మురికివాడలు, బస్తీల్లో దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఎంటమాలజిస్టు అధికారులు చర్యలు ప్రారంభించారు. దోమల నివారణకు, లార్వాను నిర్వీర్యం చేయడం, దోమలను పూర్తిగా నివారించేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు వేగవంతంగా ప్రారంభించింది. గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలతో పాటు ఖైరతాబాద్ సెంట్రల్ జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను ఖైరతాబాద్ జోన్ చీఫ్ ఎంటమాలజిస్టు వై.గంగప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రతి సర్కిల్‌కు ఒక ఏఈని నియమించి జోన్ పరిధిలో 147 బృందాల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.

జోన్‌లో 54 ఫాగింగ్ మిషిన్లు..

ఖైరతాబాద్ జోన్ పరిధిలో 54 చిన్న ఫాగింగ్ మిషిన్లు, 11 పెద్ద ఫాగింగ్ మిషిన్ల ద్వారా ప్రతి నిత్యం డివిజన్ల వారీగా దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు ఒక్కోరోజు ఒక్కో డివిజన్‌లో ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దోమల నివారణ చర్యలో భాగంగా లార్వాపై నిఘా పెట్టడం, వాటి ఆవాసాన్ని తొలగించడం, కిమోపాస్ అనే మందును పిచికారీ చేయిస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక అవగాహనలు..

బస్తీలు, స్థానిక ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు ముఖ్యంగా దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలతో పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ ప్రత్యేక అవగాహన తరగతులను చీఫ్ ఎంటమాలజిస్టు వై.గంగప్ప ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఫ్రై డే డ్రైడే వంటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యంగా లంగర్‌హౌస్ నుంచి కార్వాన్ మీదుగా అఫ్జల్‌గంజ్ వరకు మూసీలో గుర్రపు డెక్కను తొలగించడం కోసం ఇటాచి యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. డ్రోన్‌ల ద్వారా లార్వా నిర్మూలన ప్రారంభించారు. ముందు పిచికారీ, గంబూషియా చేపలు మూసీలో వదులుతున్నారు. దీంతో దోమల నివారణ చేపడుతున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



దోమల నివారణకు గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలతో పాటు ఖైరతాబాద్ జోన్ నలుమూలలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. మా జోన్ పరిధిలోని మొత్తం ఐదు సర్కిల్ కార్యాలయాల ప్రాంతాల్లో ఉన్న 27 మున్సిపల్ డివిజన్లలో 147 బృందాల ద్వారా దోమల నివారణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా లార్వాపై నిఘా ఏర్పాటు చేసి స్థానిక ఇళ్లల్లోని నీటి సంపుల్లో మందు చల్లడం, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ల్వారా నిర్మూలనకు మూసీలో డ్రోన్ల సహాయంతో పిచికారీ చేయించి నివారణ చేపడుతున్నాం. ఒక్క ఆడ దోమ 150 గుడ్లు పెడుతుందని లార్వా దశలోనే దాన్ని గుడ్లు పెట్టకుండా నివారణ చర్యలు చేపడుతున్నాం. – వై.గంగప్ప, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సీనియర్ ఎంటమాలజిస్ట్

ఆటో బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి


మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

సుల్తాన్‌బజార్: ఆటో బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని ఆగస్టు 14న నగరంలో ఒక రోజు ఆటోబంద్ నిర్వహిస్తున్నట్లు షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఐకాస తెలిపింది. కొత్త ఆటో రిక్షా షోరూమ్ ధర ప్రకారం ఆటో ఇప్పిస్తారా లేక సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా అని తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఐకాస కన్వీనర్ అమానుల్లాఖాన్ ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. షోరూమ్ డీలర్లు ఫైనాన్షియర్లతో కుమ్మక్కై ఆటోలను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆటో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ చట్టం కింద కేసులు పెట్టి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐకాస నేతలు డైమండ్ సలీం, యాహియా, మహ్మద్, లతీఫ్, హస్మి, రజాక్ పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యాలపై అవగాహన పెంపొందించుకోవాలి



గన్‌ఫౌండ్రీ: నేటి యువత శాస్త్రీయ నృత్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ నృత్య గురువు వనశ్రీరావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొరియోగ్రఫీ–కొత్త ఆలోచనలు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత నృత్యాలపై వర్క్‌షాప్ నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షురాలు కిరణ్మయి మాట్లాడుతూ..నృత్యాలపై కొత్త ఆలోచనలను యువతకు తెలియజేయడం కోసమే మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సంచలన డ్యాన్స్ ఆఫ్ స్కూల్ అధ్యక్షురాలు పద్మకల్యాణి, త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇందిరా పరసరం, వసీం రాజ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎల్బీస్టేడియంలో బోనాల పండుగను నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీస్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి బోనాల ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దుంతి వినోద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ఎల్బీస్టేడియంలోని అమ్మవారి ఆలయంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌లతో పాటు పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలియజేశారు.

ఆగస్టు 15న డయాలసిస్ ప్రీమియర్ లీగ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్

గోల్కొండ: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్న వారి కోసం ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం టౌలిచౌకీ సాలార్‌జంగ్ కాలనీలోని సాప్ కిడ్నీ సెంటర్ ఆయన డీపీఎల్ క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి అనుమతితో ఆగస్టు 15న ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమీద్ చారిటబుల్ ట్రస్టు వారి సహకారంతో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో డీపీఎల్‌ను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్ సయ్యద్ కిర్మానీ, డాక్టర్ సోహేబ్ అహ్మద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ముగిసిన సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో 5 శుక్రవారాల పాటు నిర్వహించిన అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, మహా హరతి నిర్వహించి ఉదయం 11 గంటలకు నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో స్థానిక ప్రాంతాలకు చెందిన 500 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశా రు. వరుసగా నాలుగు వారాల పాటు కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు ఆలయ కమిటీ తరపున అమ్మవారి చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ప్రభాకర్, ప్రతినిధులు జి.రాజారత్నం, కె.దత్తత్రేయ, ఏ.సతీష్, ఎస్.పి క్రాంతి కుమార్, జగ్మోహన్ కపూర్, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

నిలోఫర్‌ను సందర్శించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్


కమిషన్ బృందంతో నిలోఫర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ శుక్రవారం నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించింది. చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి నేతృత్వంలోని బృందం ఆసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్‌ను వివరాలను అడిగి తెలుసుకుంది. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను చూసి వైద్య సిబ్బందిని అభినందించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డీఈఐసీ, ఎన్ఆర్‌సీ వార్డు, శిశు విహార్ వార్డు, మదర్ డోనర్ మిల్క్ బ్యాంక్ వంటి విభాగాల పనితీరును ప్రశంసించారు. ఆసుపత్రికి ప్రయోజనం చేకూర్చే ఏదైనా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కంచెర్ల వందన గౌడ్, బండి అపర్ణ, మరిపల్లి చందన, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్, షబానా హుస్సేన్, పి.చందనేశ్వరి, కన్సల్టెంట్ మధురవాణి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ సీహెచ్.నాగజ్యోతి, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వినోద్‌కుమార్, డాక్టర్ నరేంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి శత జయంత్యుత్సవాలు


దాశరథి కవిత గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు

సుల్తాన్‌బజార్: తెలుగు భాష ఈస్ట్ ఇటాలియన్ భాష అని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు అన్నారు. శ్రీకృష్ణ దేవారాయ భాషా నిలయం ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ తెలుగు భాషా నిలయంలో మహాకవి దాశరథి శత జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు హాజరై దాశరథి గ్రంథాన్ని ఆవిష్కరించారు. మహాకవి దాశరథి కవిత్వం–వ్యక్తిత్వం సినిమా పాటలు స్మారక ప్రసంగాన్ని యువ పరిశోధకుడు కవి డాక్టర్ శరచ్చంద్ర చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ..భాషా నిలయం తెలుగు భాషను రక్షించిన నిలయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ సలహాదారులు కేవీ రమణాచారి, ప్రముఖ విద్వాంసులు డాక్టర్ శ్రీరంగచార్యులు పాల్గొన్నారు.

సన్మానం


అధికారులను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధి వంశీకృష్ణ

జియాగూడ: జియాగూడ ఇలవేల్పు సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయంలో బోనాల వేడుకలకు సహకరించిన ప్రభుత్వ అధికారులను సన్మానించామని ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, విద్యుత్, శానిటరి విభాగాలకు చెందిన కో ఆర్డినేట్ కిరణ్, ఎస్ఎఫ్ఏ రాజులతో పాటు సిబ్బందిని సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ..ప్రతి ఏటా బోనాల పండుగ రోజుల 50 వేలకు పైగా భక్తులు దర్శించుకుంటారని, ఇందుకోసం ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు.

గంజాయి పట్టివేత

చాంద్రాయణగుట్ట: కారులో తరలిస్తున్న 25 కిలోల గంజాయిని పాతబస్తీ బండ్లగూడ పోలీసులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం..వైజాగ్ నుంచి కారులో శుక్రవారం మధ్యాహ్నం గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో, సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ ఆదేశాలతో బండ్లగూడ చౌరస్తాలో పోలీసులు కారును అడ్డుకొని సోదాలు చేపట్టారు. కారు డిక్కీలో ప్యాకింగ్ చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుతూ అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టాకు చెందిన అసద్ ఖాన్ (23), మహ్మద్ యాసిన్ (23), తాహేర్ పఠాన్ (21), ఇమ్రాన్ ఖాన్ (24) స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతూ అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపర్చారు. 4వ స్పెషల్ జ్యూడిషియల్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ సత్యనారాయణ ఒక్కొక్కరికి 15 రోజుల పాటు జైలు విధిస్తూ తీర్పునిచ్చారు.

గృహిణి అదృశ్యం


లక్ష్మి

సంతోష్‌నగర్: గృహిణి అదృశ్యమైన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన పి.లక్ష్మి (48) ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు అరుంధతి కాలనీలో నివాసముండే కుమారుడి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుమారుడు సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్


డ్రంకన్ డ్రైవ్ చేపడుతున్న ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్

సంతోష్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా పగటిపూట డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌ఆసిఫ్ అన్నారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన శుక్రవారం ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న వెంకటరమణ పటేల్

చాంద్రాయణగుట్ట: మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లాల్‌దర్వాజాకు చెందిన పొన్న వెంకటరమణ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటరమణ మాట్లాడుతూ..మున్నూరు కాపు సంఘం నియమ నిబంధనలకు, రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. తనకు ఈ పదవి అప్పగించినందుకు పురుషోత్తంరావుకు ధన్యవాదాలు తెలిపారు.

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

గోల్కొండ: 4వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు శుక్రవారం షేక్‌పేట్‌లో ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లా నుంచి ఎంపికైన బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బాబురావు అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలు విజేతలు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ప్రారంభ వేడుకల్లో బాక్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ప్రఖ్యాత బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్, కోచ్‌లు వినయ్ సింగ్ తదితరులు ఉన్నారు.



గోల్కొండ కోట బోనాలు విజయవంతం


సన్మాన కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఈఓ వసంత తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట ఆషాఢ మాసం బోనాలు పూర్తిగా విజయవంతమయ్యాయని టౌలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బోనాల విజయవంతంగా ముగిసిన సందర్భంగా శుక్రవారం గోల్కొండ కోటలో దేవాదాయ శాఖ అధికారులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వాహణాధికారి సి.వసంత పోలీసులు, ఆలయ ట్రస్టీ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..జగదాంబిక అమ్మవారికి జరిగిన 9 పూజల్లో ఒక్క రోజు కూడా చిన్న అపశృతి కూడా చోటు చేసుకోలేదన్నారు. పోలీసులు సమర్థవంతమైన పాత్ర నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూశారన్నారు. ఆలయ ఈఓ మాట్లాడుతూ..ప్రభుత్వం తరఫున బోనాల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

బీసీల రిజర్వేషన్‌పై బీజేపీ వైఖరి వెల్లడించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

సుల్తాన్‌బజార్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ తమ వైఖరిని వెల్లడించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీసీ రిజర్వేషన్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్‌లో 10 శాతం ముస్లింలకు వస్తుందని, 32 శాతం మాత్రమే బీసీలకు వస్తుందని చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఎమ్మెల్యేలు, ఎంపీల మద్దతు ఇచ్చి రిజర్వేషన్ల సాధనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ పోల జనార్దన్, సంఘం జాతీయ కార్యదర్శి సుధార్ ముధిరాజ్, బోయ గోపి, బీసీఎఫ్ అధ్యక్షులు చెన్న రాములు ముదిరాజ్, తాళ్లపల్లి శేఖర్ పాల్గొన్నారు.

27న బోనాల శోభాయాత్ర


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సదానంద్, శంకర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చాట్ల సదానంద్ నేతృత్వంలో గంగపుత్ర సంఘం మూడవ వార్షికోత్సవ బోనాల శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్‌లోని నగర గంగపుత్ర సంఘం భవనంలో బోనాల శోభాయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం సదానంద్, శంకర్ మాట్లాడుదూ..నగరంలో ఉన్న 29 స్థానిక సంఘాలు, మహిళా నాయకులు, యువజన నాయకులతో 160 బోనాలతో సంఘం ఆలయం నుంచి భారీ శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, 9 గంటలకు అమ్మవారికి నూతన వస్త్రాలు ఆభరణాలు అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు బోనాల శోభాయాత్ర, పోతరాజుల గావు విన్యాసాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తాండ్ర అమృత్‌రాజ్, బిల్డింగ్ చైర్మన్ అంబటి ధన్‌రాజ్, గులాబ్ శ్రీనివాస్, ఆర్.ఉమేష్, గాండ్ల అశోక్, టి.పురుషోత్తమ్, పూస వేణుగోపాల్‌రావు, మామిడి శివ, కె.నర్సింగ్‌రావు, మహిళా అధ్యక్షురాలు కె.భగవతి, ప్రధాన కార్యదర్శి చెరక రాజశ్రీ, యూత్ అధ్యక్షులు పూస రాకేష్ పాల్గొన్నారు.